క్లుప్తంగా

కొండలమ్మకు విశేష పుష్పార్చన



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ ఆలయంలో అమ్మవారికి ఆలయ ఈఓ ఆకుల కొండలరావు శుక్రవారం విశేషాభిషేకాలను వేద పండితులచే నిర్వహించారు. అనంతరం పంచ హారతుల కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు.

వరి కోతలు ప్రారంభం



పామర్రు: మండలంలో పలు గ్రామాల్లో వరి కోతలు శుక్రవారం ప్రారంభించారు. మండలంలో 23,500 ఎకరాల్లో వరి సాగు చేశారు. ఈ నేపథ్యంలో కొన్ని చోట్ల వరి పంట కోత దశకు చేరుకోవడంతో కోతలను ప్రారంభించారు. మండలంలోని పెదమద్దాలి శివారుకొండాయపాలెంలో వరి కోతలను రైతులు ప్రారంభించారు. మరి కొన్ని చోట్ల వరి పొట్ట దశలోనే ఉంది. ఆయా గ్రామాల్లో కార్తిక పౌర్ణమి తర్వాత వరి కోతలు ప్రారంభం కానున్నాయి.

100 రోజులు పని కల్పించేందుకు చర్యలు



గుడివాడరూరల్: ఉపాధి హామీ పథకంలో భాగంగా కూలీలకు 100రోజులు పని కల్పించేలా అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ బీవై విష్ణుప్రసాద్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు, అధికారులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పనుల ఎంపిక కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి కూలీలకు ఉపాధి కలిగేలా చూడాలన్నారు. సీసీరోడ్లు, గోకులం షెడ్ల నిర్మాణాలు జరిగేలా ఫీల్డ్ అసిస్టెంట్లు పర్యవేక్షించాలన్నారు. ఏపీఓ దేవేంద్రరాజు, ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ రమేష్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గాయపడిన కార్మికుడికి రూ.10వేలు అందజేత




గుడివాడ టౌన్: ప్రమాదవశాత్తు గాయపడిన కార్మికుడికి కృష్ణాజిల్లా ఇండస్ట్రియల్ అండ్ ఆటో మొబైల్స్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.10 వేలు శుక్రవారం అందజేశారు. స్థానిక ఆటోనగర్ రెండో రోడ్‌లో కంటైనర్ రిపేర్ వర్కర్‌గా పనిచేస్తున్న తమ్మిశెట్టి నరసింహారావు ప్రమాదవశాత్తు కట్టర్ తగిలి కాలికి గాయమైంది. గాయాలపాలై ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న నరసింహారావుకు నగదు అందజేశామని యూనియన్ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, కార్యదర్శి అబ్దుల్ కుద్దూస్, సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, నాయకులు బి.ఆంజనేయులు, ఎండీ రషీద్, ఎస్ఎం. మొహిద్దీన్, బాషా, నాగరాజు, ఉపేంద్ర, గాంధీ, వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి



గుడివాడ టౌన్: పట్టణంలో ప్రజల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నట్లు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన అసిస్టెంట్ కమిషనర్ పి.శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో కలిసి పట్టణంలో పర్యటించి ఖాళీ స్థలాల్లో పేరుకుపోయిన మొక్కలు తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రజలు సైతం తడి, పొడిచెత్త వేరుచేసి చెత్తబండ్లకు అందజేయాలని కోరారు.

తప్పిన పెనుప్రమాదం



వానపాముల(పెదపారుపూడి): రోడ్డు అంతా గుంతలుగా ఉండటంతో ఆర్టీసీ బస్సు అదుపు తప్పి పక్కనే నడుము కోడ్ డ్రెయిన్‌లోకి దూసుకెళ్లిన సంఘటన మండలంలోని వానపాముల చిన వంతెన వద్ద శుక్రవారం జరిగింది. గుడివాడ డిపో నుంచి విజయవాడ వెళుతుండగా వానపాముల వద్దకు రాగానే ఆర్అండ్‌బీ రోడ్డు గుంతలుగా ఉండటంతో అదుపు తప్పింది. డ్రెయిన్‌లో నీళ్లు లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. 30 మంది ప్రయాణిస్తుండగా డ్రైవర్‌కు మాత్రమే స్వల్ప గాయాలయ్యాయి.

రైతు బేజార్

- రైతులు తక్కువ.. దళారులు ఎక్కువ
- మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారి

పేరు మాత్రం రైతు బజార్.. అక్కడ అందరూ దళారులే కూరగాయలు విక్రయిస్తుంటారు. బజార్‌లోని కూరగాయల దుకాణాల్లో మూడు వంతులు దళారులే అమ్మకాలు చేస్తున్నారు. నిజంగా పంటలు పండించిన రైతులు మాత్రం ఎక్కడా కనిపించరు. ఒక్కో దళారీ రెండు షాపుల కూడా నిర్వహిస్తున్నారు. తూకాల్లో కూడా మోసమే అని వినియోగదారులు విమర్శిస్తున్నారు. ఇదీ గుడివాడ రైతు బజార్‌లో పరిస్థితి.



రైతు బజార్‌లో కూరగాయల దుకాణాలు

పెదపారుపూడి: మండలంలోని వానపాముల గ్రామానికి చెందిన ఓ మహిళ రైతు బజార్‌కు వెళ్లి వివిధ రకాల కూరగాయలు తీసుకొచ్చింది. పక్కింటి ఆవిడ వచ్చి వాటిలో తనకు సగం కూరగాయలు కావాలని అడిగింది. దీంతో ఆమె దుంపలు, బీరకాయలు గ్రామంలో ఉన్న చిల్లర కొట్టు దగ్గరకు వెళ్లి కాటా వేయించింది. ఏది చూసినా 900 గ్రాములు తూకం వచ్చింది. దీంతో రైతు బజార్ అంతా మోసమే అని ఆవేదన వ్యక్తం చేసింది.

- పెదపారుపూడి మండలంలోని వానపాముల గ్రామానికి చెందిన కృష్ణ అనే వ్యక్తి రైతు బజార్‌లోని నిర్వాహకుడిని 'వంకాయలు కేజీ ఎంత అని అడిగాడు'.. రూ.50 అని చెప్పాడు. దీంతో 'అదేమిటి బోర్డులో రూ.46 ఉండగా రూ.50 ఏమిటి' అని ప్రశ్నించాడు. ఇక్కడ అంతే అన్నాడు. దీంతో ఆ వ్యక్తి రైతు బజార్ మేనేజర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళితే అక్కడ ఎవరూ లేరు. ప్రతి దుకాణం వద్ద ఇదే తంతు కనిపిస్తోంది. వాళ్లు చిల్లర ఇవ్వాల్సి వస్తే మాత్రం రెండు కూరగాయలు వేసి సరిపెడుతున్నారు. చిల్లర మాత్రం ఎవరూ ఇవ్వడం లేదు. అదే కొనుగోలుదారుడి నుంచి రూ.1 తగ్గినా ఒప్పుకోవడం లేదు.

బోర్డులో కంటే రేట్లు అధికం

గుడివాడ రైతు బజార్ బోర్డులో వేసి ఉన్న రేట్ల కంటే అధికంగా విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే ఆరోపణలున్నాయి. కేజీ వంకాయలు బోర్డుపై రూ.46 ఉండగా రూ.50 తీసుకుంటున్నారు.

మాయాబజార్

రైతు బజార్‌లోని కాటా తూకంపై అధికారులు పర్యవేక్షణ లేకపోవటంతో మాయాబజార్ కనిపిస్తోందని కొనుగోలుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేజీ కొనుగోలుకు 50 నుంచి 100 గ్రాముల వరకు తక్కువ వస్తున్నాయి. మామూళ్ల మత్తు వలనే అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు అనే విమర్శలున్నాయి. రైతు బజార్‌లో ఉన్న దుకాణాల్లో మూడు వంతులు దళారులే అమ్మకాలు చేస్తున్నారు. నిజంగా పంటలు పండించిన రైతులు మాత్రం కొందరే.

అధికారికి మామూళ్లు ఇవ్వాల్సిందే..

రైతు బజార్ అధికారికి వారం వారం మామూళ్లు ఇవ్వటం వల్లే అధికారి ఏమీ మాట్లాడరనే ఆరోపణలున్నాయి. మచిలీపట్నం నుంచి వచ్చే వారు మునగకాయలు, ఆకుకూరలు అమ్మే వాళ్ల నుంచి ప్రతి వారం డబ్బులు అధికారులు వసూలు చేస్తున్నారని విమర్శలున్నాయి. డ్వాక్రా సంఘాల ద్వారా ఏర్పాటైన దుకాణాల యజమానులు కూడా వారం వారం మామూళ్లు ఇవ్వటంతో ఏమి జరిగినా పట్టించుకోవటం లేదని రైతు బజార్‌లో విక్రయించే రైతులు కొందరు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి రైతు బజార్‌లో సమస్యలను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.



రైతు బజార్‌లో కింద కూర్చొని అమ్ముతున్న రైతు

షాపు అడిగితే కచ్చితంగా ఇస్తాం

రైతు ఎవరైనా సరే మా దగ్గరకు వచ్చి అడిగితే షాపు కచ్చితంగా ఇస్తాం. పెదపారుపూడి మండలంలోని కొర్నిపాడు, జమిదింటకుర్రు రైతులు అడిగినా కూడా దుకాణం ఇస్తాం. కూరగాయల తూకంపై ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి ఆ షాపు సీజ్ చేస్తాం.

– ఓగిరాల శ్రీకాంత్, రైతు బజార్ అధికారి

మాలాంటి రైతులకు షాపు ఇవ్వటం లేదు

రైతుబజార్‌లో నిజమైన రైతులకు షాపులు ఇవ్వటంలేదు. మూడొంతులు మంది దళారులే వ్యాపారం చేస్తున్నారు. ఎంతో కాలం నుంచి పంటలు పండించి రైతు బజార్‌లో అమ్ముతున్న నా లాంటి రైతులకు మాత్రం దుకాణం ఇవ్వరు. బజార్‌లో కింద కూర్చొని అమ్ముతున్నా అధికారి మాత్రం నీవు ఇక్కడ అమ్మటానికి వీలు లేదు తీసేయాలి అని అంటున్నారు. ఇప్పటికైనా జాయింట్ కలెక్టర్ స్పందించి రైతు బజార్‌పై విచారణ చేపట్టి నిజమైన రైతులకు షాపులు ఇప్పించాలి.

– పేరం కొండ, బెండ, బీర రైతు, జమిదింటకుర్రు

న్యాయ సలహా కేంద్రాన్ని సంప్రదించాలి



సదస్సులో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వీవీఎస్‌వీ లక్ష్మి

కైకలూరు: బాధితులు సలహాల కోసం కోర్టులో ఉచిత న్యాయ సహాయ కేంద్రాన్ని సంప్రదించవచ్చని కైకలూరు సీనియర్ సివిల్ కోర్టు జడ్జి వీవీఎస్‌వీ.లక్ష్మి తెలిపారు. నేషనల్ లీగల్ సర్వీసెస్ డే సందర్భంగా శ్యామలాంబపురంలో న్యాయ విజ్ఞాన సదస్సును మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జడ్జి మాట్లాడుతూ పోలీసుస్టేషన్‌లో సమస్యను చెప్పుకునేందుకు సంకోచించి వెళ్లలేని వారు కోర్టులో మండల లీగల్ సెల్‌ను సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు పి.పవన్‌కాంత్, కె.రమాదేవి, వీఆర్వో సుబ్రహ్మణ్యం, పారాలీగల్ వలంటీరు కె.రాంబాబు, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మరోసారి జరిగితే కలెక్టర్‌కు ఫిర్యాదు



సమావేశంలో హెచ్చరిస్తున్న ఎంపీడీఓ విజయసారథి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండల సర్వసభ్య సమావేశానికి హాజరు కాని అధికారులను ఎంపీడీఓ టి.వి జయసారథి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ సురేష్ అధ్యక్షతన నిర్వహించారు. పోలీసు శాఖ, ఎలక్ట్రిసిటీ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర శాఖల అధికారులు హాజరు కాకపోవటంపై ఎంపీడీఓ ఆయా శాఖలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు నెలలకు ఒకసారి జరిగే సమావేశానికి రాకుండా అంత నిర్లక్ష్యం ఏమిటని ప్రశ్నించారు. మరొకసారి ఇదే రిపీటైతే జిల్లా కలెక్టర్‌కు ఆయా శాఖల అధికారులపై ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. కాగా మండలంలో మద్యం బెల్టు షాపులు అధికంగా ఉన్నాయని ఎక్సైజ్ అధికారులకు వైస్ ఎంపీపీ శాయన రవి ఫిర్యాదు చేశారు. రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం లేక ప్రైవేట్‌గా ఎవరికైనా అమ్ముకోవచ్చునని ఏఓ ఎల్.సునీల్ తెలిపారు. తహసీల్దార్ బి.లోకరాజు, ఎంఈఓ జి.గోపాలరావు, సర్పంచ్‌లు కోటప్రోలు నాగు, భాస్కరరావు, తాతబ్బాయ్, అక్కయ్యనాయుడు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కుమారరాజా

వెంట్రప్రగడ(పెదపారుపూడి): పెదపారుపూడి మండలంలోని వెంట్రప్రగడలో ఏర్పాటు చేసిన విజయధార రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా గుడివాడ ఆర్డీఓ సుబ్రహ్మణ్యంతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ వై.రంగరావు, ఎంపీడీఓ సీతామహాలక్ష్మి, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్ చౌదరి పాల్గొన్నారు.

హనుమంతపురంలో..

పమిడిముక్కల: మండలంలోని హనుమంతపురంలో శుక్రవారం ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పర్యటించారు. శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న కొండేటి అంజయ్యను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. అదేవిధంగా శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న సాంబశివరావును పరామర్శించారు. బాబూరావు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిగా అమ్మవారు

ముదినేపల్లి రూరల్: కార్తికమాసం సందర్భంగా మండలంలోని దేవపూడి విజయదుర్గాంబ ఆలయంలో అమ్మవారిని లక్ష్మీదేవిగా శుక్రవారం అలంకరించారు. ఆలయ నిర్వాహకుడు భగవాన్‌దాస్ ఆధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు.

మండవల్లి: మండలంలోని ఆలయాల్లో శుక్రవారం కార్తిక మాస పూజలు ఘనంగా నిర్వహించారు. కానుకొల్లు, లింగాల, పెరికెగూడెం, అయ్యవారిరుద్రవరం, శోభనాద్రిపురం విశ్వేశ్వరస్వామి ఆలయాలు, మండవల్లి శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయాల్లో అర్చకులు పూజలు జరిపారు.

సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాపోరు యాత్రలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

గుడివాడ టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ ప్రజాపోరు యాత్ర నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ప్రజాపోరు యాత్ర బ్రోచర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారాన్ని ఎత్తి చూపుతూ ఈ నెల 13వ తేదీ వరకు వార్డుల్లో కరపత్రాలు పంపిణీ చేస్తామన్నారు. 14వ తేదీన మండల కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి వినతిపత్రాలు అందజేస్తామన్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, వంటనూనెల ధరలు విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం వాటిని నియంత్రించే కార్యక్రమం చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించి యువతను ఆదుకోవాలన్నారు. ఉచిత ఇసుక ఇస్తామని ఇప్పటి వరకు దానిపై స్పష్టత లేకుండా చేశారని తద్వారా అనేక విభాగాల కార్మికులు పనులు లేక రోడ్డున పడుతున్నారన్నారు. ప్రజలను చైతన్యపర్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఐద్వా కార్యదర్శి పి.రజిని, ఎల్. సురేంద్ర పాల్గొన్నారు.

కొల్లేరు ప్రాంత అభివృద్ధికి కృషి



గుమ్మళ్లపాడులో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు: కొల్లేరు గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. గుమ్మళ్లపాడులో సీసీ రోడ్డు శంకుస్థాపన, మైక్రోవాటర్ ఫిల్టర్‌ను శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పందిరిపల్లిగూడెం వద్ద పీహెచ్‌సీని సందర్శించి కొల్లేరు పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోతే విజిలెన్స్‌తో కేసులు నమోదు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు కురేళ్ల బేబీ పాల్గొన్నారు. స్థానిక ట్రావెలర్స్ బంగ్లాలో సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే కామినేని పంపిణీ చేశారు.

గేటు పడితే నరకమే..!

- భీమవరం రైల్వేగేటు వద్ద వాహనదారుల అవస్థలు



భీమవరం రైల్వేగేటు తీయడంతో ఎదురెదురు వాహనాల రాకపోకలతో ఇబ్బందులు

గుడివాడరూరల్: నూతనంగా నిర్మిస్తున్న ఫ్లై ఓవర్ల వద్ద గుడివాడ-భీమవరం రైల్వేగేటు వద్ద ట్రాఫిక్ సమస్యతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రైల్వేగేటు తీయగానే ఒక్కసారిగా ఎదురెదురుగా వాహనాలు ఎదురుపడటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు నరకయాతన అనుభవిస్తున్నారు. భీమవరం-పామర్రు రైల్వే గేట్ల వద్ద ఫ్లై ఓవర్ల నిర్మాణాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు మంజూరు చేయడంతో ఏడాదిగా ఫ్లై ఓవర్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. పనులు జరుగుతున్న నేపథ్యంలో భీమవరం రైల్వేగేటు, కేటీఆర్ కళాశాల రైల్వేగేటు, బిళ్లపాడు రైల్వేగేట్ల వద్ద రైళ్లు వెళ్లే సమయంలో గేట్లు వేసి తీయడంతో వాహనదారులు గంటలు తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుని తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ట్రాఫిక్ సమస్య ఏర్పడి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా భీమవరం రైల్వేగేటు వద్ద భారీగా వాహనాలు నిలిచిపోయి వెళ్లడానికి వాహనదారులు తంటాలు పడుతున్నారు. అధికారులు వాహనాలు వెళ్లేందుకు, వచ్చేందుకు వేర్వేరుగా రైల్వేగేట్ల వద్ద మార్గాలను ఏర్పాటు చేశారు. పర్యవేక్షణను గాలికివదిలేయడంతో రెండురైల్వే గేట్ల వద్ద ఎదురెదురుగా వాహనాలు వచ్చేయడంతో ఇబ్బందికరంగా మారింది. వాస్తవానికి పామర్రు, మచిలీపట్నం వైపు నుంచి వచ్చే వాహనాలు కేటీఆర్ రైల్వే గేటు వైపుగా పట్టణంలోకి వెళ్లాలి. గుడివాడ వైపు నుంచి మచిలీపట్నం, పామర్రు వెళ్లే వాహనాలు భీమవరం రైల్వే గేటు ద్వారా వెళ్లాల్సి ఉంది. భారీ వాహనాలు ఇదే విధంగా వెళ్తున్నా ద్విచక్ర వాహనాలు, ఆటోలు, వ్యాన్‌లు యథేచ్ఛగా రెండుగేట్ల నుంచి ఇష్టానుసారంగా వెళ్లిపోవడంతో ఎదురెదురుగా వాహనాలు ఎదురు పడి ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతోంది. పర్యవేక్షణను పోలీసులు ఫ్లై ఓవర్ల వద్ద ఉంటున్న వాచ్‌మెన్‌కు వదిలేయడంతో ట్రాఫిక్‌ను నియంత్రించడం వారికి కష్టతరంగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రైల్వేగేట్ల వద్ద వన్‌వే రూట్ ఏర్పాటు చేసి ఎదురెదురుగా వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకుని ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

సంక్షిప్త వార్తలు

■ నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పామర్రు: మండలంలోని పలు గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈఈ మోహనకృష్ణారావు శుక్రవారం తెలిపారు. మండలంలోని ఉరుటూరు, కురుమద్దాలి, ఉండ్రపూడి, పోలవరం, రాపర్ల, జమీదగ్గుమిల్లి, నాగపట్నం తదితర గ్రామాల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతులు జరుగుతున్న కారణంగా ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు పేర్కొన్నారు.

■ బాలికల ఎదుగుదలపై దృష్టి పెట్టాలి

గుడివాడ టౌన్: బాలికల ఎదుగుదల వారి భవిష్యత్‌పై తల్లులు దృష్టిపెట్టాలని సీడీపీఓ విజయా ఫ్లోరెన్స్ అన్నారు. స్థానిక నీలామహల్ రోడ్డులోని మున్సిపల్ ప్రైమరీ పాఠశాల్లో శుక్రవారం చిన్నారులకు తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కిశోర బాలికల సంరక్షణలో తల్లులు అనుక్షణం శ్రద్ధ చూపాలన్నారు. బాధ్యతగా వ్యవహరిస్తూ వారికి సమాజంపై అవగాహన పెంచాలన్నారు. బాల్య వివాహాలు చేయవద్దని ఆమె సూచించారు. సూపర్‌వైజర్లు జ్యోతి, జయంతి, ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రశాంతి పాల్గొన్నారు.

■ అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు

గుడివాడరూరల్: బాలికల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన శిక్షలు తప్పవని గుడివాడ టూటౌన్ ఎస్ఐ జాస్మిన్ పేర్కొన్నారు. పట్టణంలోని 25వ వార్డు పెద ఎరుకపాడు మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వ్యక్తిగత శరీర భాగాలను ఎవరూ ముట్టుకోకూడదన్నారు. గుడివాడ పరిసర ప్రాంతాల్లో ఈవ్ టీజింగ్ నివారించేందుకు ప్రత్యేక మహిళా సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. బాలికలు, మహిళలకు ఎటువంటి ఇబ్బంది కలిగినా వెంటనే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.

■ విద్యుత్ అక్రమంగా వినియోగిస్తే చర్యలు

గుడివాడ టౌన్: విద్యుత్‌ను అనధికారికంగా వినియోగిస్తే కఠిన చర్యలు తప్పవని విద్యుత్ శాఖ విజిలెన్స్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం. ఆల్ఫన్స్ అన్నారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ అక్రమ వినియోగాల నివారణకుగాను గుడివాడ డివిజన్ విద్యుత్ అధికారులతో కలిసి నియోజకవర్గంలోని నందివాడ మండలంలో తనిఖీలు చేపట్టామన్నారు. 287 ఆక్వా, 1,513 గృహాలు, 114 వాణిజ్య సర్వీసులు, 160 అదనపు లోడు సర్వీసులలో విద్యుత్ అక్రమ వినియోగం గుర్తించామన్నారు. అలాంటి వారికి రూ. 5 లక్షల 81 వేలు జరిమానా విధించామని తెలిపారు. తనిఖీలలో ఐదు మల్టిపుల్ సర్వీసులు గుర్తించామన్నారు. గుడివాడ ఈఈ జీబీ శ్రీనివాసరావు, ఏఈలు, ఏఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

■ తాగునీటి సరఫరాకు చర్యలు

మండవల్లి: మండవల్లి తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లే రోడ్డులో వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద శుక్రవారం కుళాయిలకు తాగునీరు రావడం లేదని ఆ ప్రాంత వాసులు చెప్పడంతో సర్పంచ్ మెండా ఝాన్సీ సంఘటన స్థలానికి వెళ్లారు. తాగునీటి సరఫరా కోసం చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

■ భూ సమస్యలు పరిష్కరిస్తాం

గుడ్లవల్లేరు: రైతుల భూ సమస్యలను పరిష్కరిస్తామని రీసర్వే డీటీ రత్నకుమారి పేర్కొన్నారు. శుక్రవారం డోకిపర్రులో నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో సర్పంచ్ గోసాల జ్యోతి రైతుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. సమావేశంలో డీఐఓఎస్ జోజిబాబు, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, పంచాయతీ కార్యదర్శి మస్తాన్‌రావు, విలేజ్ సర్వేయర్లు కోటేశ్వరరావు, ఫణి పాల్గొన్నారు.

■ ముదినేపల్లిని కృష్ణా జిల్లాలో కలపాలి

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండలాన్ని ఏలూరు జిల్లా నుంచి తప్పించి కృష్ణా జిల్లాలో చేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి శుక్రవారం వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ముదినేపల్లి మండలాన్ని ఏలూరు జిల్లాలో కలిపివేయడంతో మండలంలోని ప్రజలు అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ఏలూరులోని ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లేందుకు అవస్థలు పడాల్సి వస్తోందన్నారు. నేరుగా బస్సు సౌకర్యం లేకపోవడంతో 65 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏలూరులోని ప్రభుత్వ కార్యాలయాలకు మూడు బస్సులు మారి వెళ్లాల్సి వస్తోందని పేర్కొన్నారు.

■ మహిళల భద్రతకు అభయ యాప్

కైకలూరు: మహిళల భద్రతకు అభయ యాప్ అందుబాటులో ఉందని రూరల్ సర్కిల్ సీఐ వి.రవి కుమార్ పేర్కొన్నారు. పందిరిపల్లిగూడెం పీహెచ్‌సీలో ఏఎన్ఎం, ఆశ వర్కర్లకు మహిళా సంరక్షణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను శుక్రవారం వివరించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు, చిన్నారులపై నేరాలు, ర్యాగింగ్ అదుపు చేయడానికి 112, సైబర్ నేరాల అదుపునకు 1930, బాల్య వివాహాల నిరోధానికి 1098 టోల్ ఫ్రీ నంబర్లు ఉపయోగపడతాయన్నారు. రూరల్ ఎస్ఐ వి.రాంబాబు పాల్గొన్నారు. వేమవరప్పాడు పాఠశాలలో టౌన్ ఎస్ఐ డి.వెంకట్‌కుమార్ మహిళా చట్టాలపై విద్యార్థులకు వివరించారు.

■ బెల్టు దుకాణాలపై ఉక్కుపాదం

కైకలూరు: నియోజకవర్గంలో మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సీఐ ఎస్‌కే.రమేష్ హెచ్చరించారు. స్థానిక కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గురు, శుక్రవారాల్లో మండవల్లి మండలం చావలిపాడు, కానుకొల్లు గ్రామాల్లో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తుల నుంచి 24 అక్రమ మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

■ విద్యార్థుల క్షేత్రస్థాయి పరిశీలన

కైకలూరు: పక్షి ప్రేమికుల స్వర్గధామంగా పేరుగడించిన ఆటపాక పక్షుల విహార కేంద్రాన్ని స్థానిక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బీజెడ్‌సీ, ఏజెడ్‌సీ విద్యార్థులు క్షేత్ర స్థాయి పరిశీలన చేశారు. పక్షుల సంరక్షణ, వాటి దినచర్య, ఆహారపు అలవాట్లు, పక్షి జాతుల గురించి తెలుసుకున్నారు. జువాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.సంధ్య మాట్లాడుతూ విద్యార్థులు పుస్తకాలకు మించి సహజ వాతావరణాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఫ్యాకల్టీ సభ్యులు ఎం.వి జయ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డి.ఉదయప్రకాష్ పాల్గొన్నారు.

■ పేదలే ప్రాతిపదికన సేవా కార్యక్రమాలు

గుడ్లవల్లేరు: లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో పేదలే ప్రాతిపదికగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ జిల్లా మాజీ చైర్మన్ వై.పి.సి.ప్రసాద్ అన్నారు. స్థానిక లయన్స్ సేవాభవన్‌లో లయన్స్ సభ్యులకు చైర్మన్ నిమ్మగడ్డ శశికళ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. అనంతరం పోలవరపు సుగుణ కుమారి ప్రథమ వర్ధంతి సందర్భంగా అన్నదానం చేపట్టారు. లయన్స్ కార్యదర్శి పెరుమాళ్ల, కోశాధికారి కల్యాణపు నవాబు, లయన్స్ ప్రతినిధులు వెంకట్రావు, సుబ్బారావు, వీరభద్రరావు, విజయ్ పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను ఆహ్వానించకపోవడం దారుణం



నందివాడ: గ్రామాల్లో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించకుండా అధికారులు దారుణంగా ప్రొటోకాల్‌ను ఉల్లంఘిస్తున్నారని వెంకట రాఘవపురం సర్పంచ్ కాకరాల సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పేయ్యల ఆదాము అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగింది. సమావేశం ప్రారంభం కాగానే అధికారుల తీరుపై సర్పంచ్ సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల తన సొంత గ్రామంలో జరిగిన సీసీ రోడ్ల నిర్మాణాల శంకుస్థాపనకు సర్పంచ్‌ను పిలవకుండా ఎటువంటి పదవులు లేని వ్యక్తులను తీసుకొచ్చి ప్రారంభోత్సవాలు అధికారులు దగ్గరుండి చేయించారని ఆరోపించారు. దీంతో ఎంపీపీ స్పందిస్తూ ఇకపై ప్రొటోకాల్ పాటించి ప్రజాప్రతినిధులను గౌరవిస్తామని తెలిపారు. అనంతరం మండలంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీడీఓ మల్లీశ్వరి, తహసీల్దార్ గురుమూర్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.